# ఒయాసిస్సు

ఒరిస్సా తీర ప్రాంతంలో తుఫాన్ పడగ విప్పింది. కుండపోతగా వర్షం. ఊహించని రీతిలో వరదలు. చెట్లు చేమలు కూలి రోడ్ల పక్కన, రోడ్లకు అడ్డంగా పడి రోడ్లు కనపడడంలేదు. బరంపురం నుండి భువనేశ్వర్ వరకు ఎటుచూసినా నీరే, నీరు. రెండురోజుల తర్వాత గానీ నేల కనిపించలేదు. పూర్వం ఉన్న చెట్లు లేవు. చెట్లమీద పక్షుల చప్పుడు లేదు. కనీసం కాకుల అరుపులు లేవు, కప్పల చప్పుడు తప్ప. చచ్చిపడివున్న పశువుల, గొర్రెల, మేకల, పందుల కళేబరాలు కంపుకొడుతున్నాయి. అంతేకాదు ఎక్కడ పడితే అక్కడ మరెన్నో మానవ కళేబరాలు పడివున్నాయి. ఎటుచూసినా భయానక దృశ్యాలే. కూలిపోయిన ఇళ్లు, వరదల పాలైన పంటపొలాలు. కాలిపోయిన కరంటు మోటారులు, పడిపోయిన టెలిఫోన్ స్తంభాలు. రోడ్లు కరులు కోసి, వంపులు పర్రెలులాగ మారాయి. సైన్యం రంగంలోకి దిగి అన్ని పోగొట్టుకుని చావగా మిగిలిన జనం ఆకలిని చల్లార్చడానికి ఆహారపు పొట్లాలను అందచేస్తూ వున్నారు. కొంతమంది ఇంటికప్పులమీద కూర్చొనివున్నారు. వీలైన మార్గాల ద్వారా ఎత్తు ప్రాంతాలకు తరలి వెళుతున్నారు.

బరంపురంలో తుఫాన్ తాకిడి కొంచం తక్కువగా వుంది. అది ఓ వ్యాపార కూడలియే కాకుండ తెలుగు సాహిత్య వికాసానికి ఎంతో కృషి చేసిన పెద్దలు పుట్టి పెరిగిన స్థలమది. అక్కడ సగానికి సగం తెలుగువాళ్లే ఉంటున్నారు.

ఆ పట్టణం చివరన ఓ బంగళా. దాని చుట్టూ వున్న విశాలమైన కాంపౌండ్‌కు దృఢమైన ఇనుపగేటు. దానిని ఆ రోజుల్లో తెల్లవాళ్లు తమ విడిదికోసం కట్టించుకున్నది. ఇప్పటికీ చెక్కు చెదరలేదు. పూర్తిగా రాతితో నిర్మించింది. పక్కనే పదికిలోమీటర్ల దూరంలో సముద్రం. ఉప్పునీటి తాకిడివల్ల బంగళా గోడలకొచ్చిన మార్పును గుర్తించవచ్చు. అన్ని సౌకర్యాలు కలిగి వున్న నాలుగు గదులు, ఓ హాల్, దానికి అతికించినట్టు ముందు పోర్టికో. కాంపౌండ్‌కు ఆనుకుని ఓ ఔటౌస్, దానికో చిన్న వరండా. ఆ కాంపౌండ్‌లో రకరకాల చెట్లు. ప్రస్తుతం ఆ బంగళాలో ఓ క్రైస్తవ కుటుంబం ఉంటూ వుంది. చీకటి చిక్కపడుతున్న వేళ, కప్పలు అరుస్తున్నాయి. చచ్చి పడివున్న చేప పిల్లల కోసం పిల్లులు తిరుగుతున్నట్లుంది, అక్కడక్కడ వాటి కళ్లు మెరుస్తున్నాయి.

ఆ బంగళా గేటును ఎవరో తట్టిన శబ్దం. లోపల గోడ పక్కమ్మటి కుంపటి దగ్గర కూర్చున్న లూసి లేచి కిటికిలో నుండి చూసింది. లాంగ్ కోటు వేసుకుని, తలపై రేన్ క్యాప్ పెట్టుకున్న ఓ మనిషి గేటు దగ్గర నిలుచుని వున్నాడు. అది గమనించిన ఆల్సేషన్ డాగ్ 'కడల్ కడల్' మని అరుస్తూ వుంది. అపరిచిత వ్యక్తి మక్కుమూసుకుని పక్కకు చూశాడు.

కొంత దూరంలో ఓ కోళ్లఫామ్ అందులో కోళ్లన్నీ చెరువులో వేసిన 'బతకమ్మల్లాగా' చెల్లాచెదురైనట్టు చచ్చిపడివున్నాయి.

చీకటి మరీ చిక్కగౌతూవుంది. ఈదురుగాలి వీస్తూవుంది. చుట్టు పక్కల నుండి వస్తూవున్న దుర్వాసనకు ముక్కు పుటాలు తట్టుకోలేక పోతున్నాయి.

అతను మళ్లీ గేటు తట్టాడు. కుక్క రెచ్చిపోయినట్లుగ మొరుగుతూవుంది. లూసి టార్చ్ వేసి కిటికిలోనుండి చూసింది. అపరిచిత వ్యక్తి 'లోనికి రావచ్చా' అన్నట్లు చూశాడు. లూసి టార్చ్‌తోవచ్చి, గేటు తెరుస్తూవుంటే ఆమె మెడలో శిలువ కనిపించిందతనికి. రూపు, రంగును బట్టి విదేశి క్రైస్తవురాలిగా గుర్తించి -

"ఐయాం సుందర్‌లాల్" అన్నాడు.

"ఐసి" అంటున్నప్పుడు చిరునవ్వు పెదాలను కదిలించింది.

"ఇక్కడ,తెలిసినవాళ్లు ఎవరులేరు ఈ రాత్రి - " అని సంశయంగా ఆగాడు. చివరికి ఓ క్రైస్తవుల ఇంట్లో ఆశ్రయమడుగుతున్నందుకు తనలో తానే గుణిగాడు. ఆ తరువాత వాసుదేవున్ని గుర్తుకు తెచ్చుకుని తృప్తి పడ్డాడు.

'కమిన్' అన్నట్టు సైగచేసింది లూసీ. లోపలికి వచ్చిన సుందర్ లాల్ గేటు మూసి లోపలికి నడుస్తున్నపుడు కుక్క మరీ మరీ మొరుగుతూవుంది. సుందర్ లాల్ కాస్త తటపటాయిస్తూ పోర్టికోవరకొచ్చి, లోపలికి చూశాడు, కనిపించినంత మేర మగవారున్నట్టు లేరు. చుట్టూచూశాడు. ప్రత్యేకంగా ఓసారి గేటువైపు చూశాడు. తాను లోపలికి రావటం ఎవరైనా చూశారా? అనుకుని 'ఎవరూ చూడలేదు' అని సమాధానపడ్డాడు. ఔట్‌హౌస్‌లో మాత్రం మనుషుల అలికిడి వినిపించింది.

"కం, జంటిల్‌మెన్" అంది లూసి గెస్ట్‌రూమ్ తలుపులు తెరుస్తూ

ఆమె సంబోధనకు ఒక్కసారి ఉలిక్కిపడి, తమాయించుకున్నాడు. ఆ తర్వాత లోపలికి నడిచాడు.

"ఈ గదిలో అన్ని వసతులున్నాయి, పొడి బట్టలు తెస్తాను" అంటూ లోపలికి నడిచింది. సుందర్‌లాల్ కోటును వదిలి, స్టాండుకు తగిలించి, వీపున వున్న బ్యాగ్‌ను తీసి కోటు చాటునవుంచి, దానిమీద తన టోపిని వుంచాడు. షూను వొదిలి మంచం కిందికి నెట్టాడు. సాక్స్ విడిచి స్టాండ్ అడుగు భాగాన ఆరవేశాడు.

'కడల్‌కడల్' మని కుక్క మొరుగుతూనేవుంది.

లూసి పొడిబట్టలను అతనికిచ్చి, కిటికి దగ్గరికెళ్లి కుక్కను గద్దించింది. అయినా ఇంట్లోకి కొత్త మనిషి రాక యిష్టం లేనట్టు కుక్క తన నిరసనను తెలుపుతున్నట్టు "కుయ్ కుయ్"

మని రోదిస్తూనేవుంది. "మీరు బట్టలు మార్చుకుని ఆ మంట దగ్గరకు రండి." అంటూ కుంపటివైపు చూపించింది.

అప్పుడే ఓ నల్లపిల్లి 'మ్యావ్' అంటూ ముందునుండి వెళ్లింది.

తుఫాన్‌వల్ల విద్యుత్‌సరఫరా మూడురోజుల కిందే ఆగిపోవడం వల్ల గది గదికి కొవ్వొత్తి వెలిగించింది. హాల్లోనే ఓ పక్కన టెలిఫోన్ వుంది.

"జంటిల్‌మెన్ ఈ ఊలెన్ కోటు వేసుకోండి "అంది.

'ఈ బట్టలు ఎవరివో' అన్నట్టు చూశాడు. అది గ్రహించిన ఆమె

"అప్పుడప్పుడు మా దేశస్తులు వస్తూ ఉంటారు. వాళ్లకోసం వుంచబడ్డవి. వాళ్లు ఇక్కడ ఉన్నన్ని రోజులు ఇక్కడి స్టయిల్‌నే ఇష్టపడతారు"

దానికి బటన్స్ వున్నాయో లేవో అని చెక్ చేస్తూ అంది. ఆ తరువాత వంట గదిలోకి వెళ్లి ట్రాలీపై అన్నం, రొట్టె, కూరలు పేర్చుకుని, దానిని నెట్టుకుంటు అవుట్‌హౌస్ వైపు నడిచింది.

సుందర్‌లాల్ ఆమె వెనకాలె వచ్చి కుక్క భయానికి కిటికి దగ్గర ఆగి బయటకు చూస్తూ నిలుచున్నాడు.

మనిషికి భయపడని మనిషి కుక్కకు భయపడతాడు!

లూసి రాకను చూసి గదిలో వున్న వాళ్లు తమ తమ పాత్రలను కడుక్కొని బయటికొస్తూ "వందనాలమ్మా, వందనాలు" అంటూ వంగి దండాలు పెడుతున్నారు. ఒకరికి చేతికి వేళ్లు లేవు. మరొకరికి ముక్కు అణిగి ఉంది. మూడవ వ్యక్తికి కనుబొమ్మలు చెవులు వాచివున్నాయి. నాలుగవ వ్యక్తికి పాదాల ముందటి భాగంలో వేళ్లు ఊడిపోయి ఉన్నాయి. వాళ్ల గిన్నెల్లో కొంచెం అన్నం, రొట్టె, ఒక గుడ్డు యింకా కూరగాయలను వడ్డించింది. మరొకసారి వందనాలు అంటూ లోపలికి నడిచారు. వరండాలోని ఓ మూలన వున్న కుందేళ్ల పొదిలో కొన్ని పచ్చి కూరగాయలు, మొక్కజొన్న గింజలు చల్లింది. ఆతరువాత జొన్నలు మాంసం కలిపి వండిన అన్నం కుక్క తొట్టిలో వేయగానే కుక్క ఆత్రుతగా తింటూ తన యజమానివైపు కృతజ్ఞతగా చూస్తూ గునుస్తూ వుంది. ఆ గునుసుడులో ఆకలి తీరుతున్న తృప్తి విశదమౌతుంది. ట్రాలీని తోసుకుంటూ తిరిగి ఇంట్లోకి వచ్చింది. కిటికి దగ్గర నిలుచుని చూస్తున్న సుందర్‌లాల్ ఎదురెళ్లి-

"వాళ్లు - " అంటూ ఆగాడు.

"దేవుని బిడ్డలు. అనారోగ్యంతో బాధపడుతున్నారు. వారు స్వస్థత కోసం ఇక్కడికి వచ్చిరి. వాళ్లకు సేవచేయమని ప్రభువు నన్ను ఆదేశించెను. వాళ్లు నేను ఉండుటకే ఈ

పెద్ద భవంతిని ఆయనే ఏర్పాటు చేసెను. రోజంతా ఇంకా ఎందరో వస్తూ పోతూ వుంటారు. తీవ్రంగా బాధపడేవాళ్లు కొన్నాళ్లు ఇక్కడే వుంటారు. ఆ తరువాత మరో బ్యాచ్" అంటూ హాల్లోని సంపు దగ్గర ఆ ట్రాలీని ఆపింది. మళ్లీ వంటగదిలోకి వెళ్లి, హాల్లోని డైనింగ్ టేబుల్ వద్దకు డిష్‌లతో వస్తూ - " జంటిల్‌మెన్ మనం రాత్రి భోజనం చేద్దాం రండి" అంటూ, మూడు కంచాలు శుభ్రపరచి, వడ్డించింది.

సుందర్‌లాల్ వాష్ బేసిన్ లో చేతులు శుభ్రం చేసుకుంటూ 'మూడో కంచం ఎవరికా అని ఆలోచిస్తున్నాడు, బహుశ పక్కగదిలో భర్త వుండొచ్చేమో. తలెత్తి గోడవైపు చూశాడు అక్కడో ఫోటో తగిలించివుంది. ఆ ఫోటో ఎవరిదో, దాని ముక్కు ముఖం కనపడకుండ దండలు వేసివున్నాయి. బహుశ వీళ్ల కుటుంబంలోని ఎవరో పోయినవారై వుండాలి' అనుకున్నాడు. అప్పుడే ఓ బల్లి గోడనుండి జారి కింద పడి పక్కకు పరుగెత్తింది. ఈ లోపల లూసి వెళ్లి ఓ వృద్ధురాలికి చేయి ఆసరా ఇచ్చి తీసుకొచ్చి, వాష్ బేసిన్ దగ్గర చేయి కడిగించింది. ఆ తర్వాత ఆమెను కంచం ముందు కూర్చోబెట్టింది. విదేశి రూపురేఖలో తెల్లగ, పండుటాకులావున్న ఆ వృద్ధురాలు ఎదురుగా కూర్చున్న సుందర్‌లాల్‌వైపు చూస్తూ వుంది 'కానీయండి' అన్నట్టు కళ్లను కదిలించింది. ఆ కదలికలకు అనుమానం అనిపించి -

"మేడమ్ అమ్మకు నోరు లేదా?" అన్నాడు.

"లేదు. అదో ట్రాజడి! మా కుటుంబంలో ఎదురైన అనుకోని విషాదానికి ఆమె మూగ పోయింది. నేనే మొండిదాన్ని, అయిన వారందరూ ఒకేసారి పోయినా నాకేం కాలేదు." నీళ్ల గ్లాసు అతని వైపు జరుపుతూ అంది.

"ఛో, ఛో" అన్నాడు అంగలార్చినట్టు. ఆ సంభాషణను అర్థం చేసుకున్నదేమో ఆమె ముడతలుబడ్డ కను రెప్పలకింద తడి మెరిసింది. తాను ధరించిన నైటిజేబులో నుండి హాంకి తీసి ముక్కు చివర అద్దుకుంది. పళ్లెంలో వున్న ఆహారంపై అరచేతిని ఉంచి ప్రార్థన చేస్తూవుంటే, లూసి కూడా ఆమెను అనుసరించింది. సుందర్‌లాల్ రొట్టెను కాకుండా ముందు అన్నపు ముద్దను నోట్లో పెట్టుకున్నాడు. లూసి చేప ఫ్రై ముక్కలను వడ్డించింది. డిన్నర్ ముగిసింది.

కరెంట్ రాగానే అంతవరకు వెలుగుతున్న క్యాండిల్స్‌ను ఆర్పేస్తూ "మూడురోజులకు కాని కరెంట్ రాలేదు" అంది లూసి.

"నేను ఈమెకు పక్కవేసి, పడుకోబెట్టి వస్తాను. న్యూస్ అయిపోవచ్చు. చూస్తారా?" అంటూ టి.వి ఆన్ చేసి, పెద్దావిడను పట్టుకుని పక్కగదిలోకి నడిచింది.

'సరే' అన్నట్టు తలూపాడు సుందర్‌లాల్ టి.వి వైపు చూస్తూ. అప్పటికే వార్తలు అయిపోయి, ముఖ్యాంశాలు మరోసారి అని -

" తుఫాన్ మూలంగా జరిగిన నష్టాలను భర్తీ చేయడంలో భారత ప్రభుత్వం సహకరించాలని ముఖ్యమంత్రి ప్రధానిని కోరారు.

ముగ్గురు క్రైస్తవులను సజీవ దహనం చేసిన హంతకుని ఆచూకి తెలిపినా, లేదా పట్టించినా ఐదు లక్షల రూపాయల నగదు బహుమతిని ప్రభుత్వం ప్రకటించింది. పేరు భజన్‌లాల్. ఆరడుగుల మనిషి. వయస్సు ముప్పై పైగా,రంగు చామనఛాయ చిన్న గడ్డం. గుట్కా సేవిస్తుంటాడు. వార్తలు ఇంతటితో సమాప్తం".

'ఒక మనిషిని పట్టిస్తే లక్షల కొలది బహుమానం! ఈ ప్రభుత్వమంత గుడ్డిది మరొకటి లేదు. ఎవరు ఎవర్ని ఎందుకు చంపారు అని ఆలోచించదు' అని నవ్వుకున్నాడు.

అప్పుడే లూసి హాల్లోకి రాగా సుందర్‌లాల్ లేచి నిలుచున్నాడు.

"చదవాలనుకుంటే అక్కడ మాగజైన్స్ వున్నాయి" అంటూ బయటికి వెళ్లి కుక్కను వదిలి పెట్టి లోపలికొచ్చి తలుపులు మూస్తున్నప్పుడు, "మేడమ్, మీరు వుండబట్టే ఈ లెపర్స్ ఆరోగ్యం, వారి బాగోగులు చూస్తున్నారు. మీకు తప్పక పుణ్యం చేకూరుతుంది." అన్నాడు.

"మావారూ ఇదే పని చేసినారు." అనగానే, 'అలాగా' అన్నట్టు చూశాడు.

ఆమె కళ్లల్లో తన భర్త, రూపం కదిలింది. అంతే మౌనంలోకి వెళ్లింది.

"మిమ్ములను బాధపెట్టానా?" అన్నాడు. తా ను అనుకోని షాకుకు గురి అవుతూ.

" లేదు" అంటూ ఓ బరువైన శ్వాసవొదిలి, మెడలోని శిలువను కళ్లకద్దుకుంటూ మంచినీళ్ల తేవడానికివెళ్లింది. సుందర్‌లాల్ తేరుకుని అక్కడ వున్న మ్యాగజీన్స్ అందుకుని గెస్ట్ రూంలోకి వెళ్లాడు.

ఓసారి సుందర్‌లాల్ కిటికీలోనుండి బయటికి చూశాడు 'అక్' మంటు కుక్క పరుగెత్తుకొచ్చి, ముందలి కాళ్లు పైకెత్తి కిటికీకి ఆనించి తన మూతిని గ్రిల్‌లో నుండి లోపలికి పెట్టి వాసన చూసింది. మంచినీళ్ల మగ్‌తో వచ్చిన లూసి డోర్ వద్ద నిలుచోని, కుక్కను గద్దించి, మగ్‌అందించి వెళ్లింది. ఆమె వెళుతూవుంటే ఆమెనే చూస్తూ నిలుచున్నాడు.

'తెల్లరంగులోవున్న పొడగరి, కత్తిరించబడ్డ బెల్లం రంగు తల వెంట్రుకలు. నీలి కళ్లు. తెల్లని చీరె రవికలో ఏ నగలు లేకున్నా ఎంతో నిరాడంబరంగా, హుందాగా వుంది. చాలారోజులనుండి ఇక్కడే వుంటున్నట్టుంది. అందుకే తెలుగు చక్కగా మాట్లాడుతూవుంది. నలభై ఆపై వున్నా ఎంతో చురుకుగా వుందామె' అనుకుంటూ తలుపులు వేసుకుని మంచంమీద కూర్చున్నాడు. తల వైపు వున్న స్టూల్ మీద బైబిల్‌వుంది. దానిపై సుందర్‌లాల్ దృష్టిపడగానే అతని కనుబొమ్మలు ముడిపడి విడిపోయాయి. 'ఈ

పుస్తకాలు పంచే కదా హిందువులను క్రైస్తవులుగా మారుస్తారు. దీనికి తోడు రొట్టె, బట్టలను పంచుతారు. కూడు గుడ్డ లేని పేదవాళ్ళు వాటికి ఆశపడి మెడలో శిలువను వేసుకుంటారు. ఆ తరువాత మతం మార్చుకుని పక్కింటివాళ్లను కూడ పరాయి, వాళ్ళుగా చూస్తారు. బంధువులను కూడా అన్యులు అంటారు. తాము తప్ప అందరు సయితానులంటారు.' అని తనలో తానే గొణుక్కున్నాడు. అసహనంగా కదిలాడు. ఇంతకు ముందు టి.వి వార్తలు గుర్తుకొచ్చాయి. 'పట్టి ఇచ్చిన వారికి ప్రకటించిన లక్షలకు లక్షలు. అంత పోలీసు బలగముండి పట్టుకోలేరా? ఎవరైనా పట్టించండి, మీకు డబ్బు ఇస్తాం అంటారా ఓరి చేతకాని చవటల్లారా! అంటూ నవ్వుకున్నాడు. తన నవ్వు ఇంట్లోవున్న వాళ్లకు వినిపించిందో ఏమో అని శ్వాసను బిగపట్టి మౌనంలోకి వెళ్లాడు.

అప్పటికే కుక్క రెండుసార్లు దాని గోళ్లతో తలుపును గీరి చూసింది. తనకెందుకో పోలీసు కుక్కలు గుర్తొచ్చాయి.అవి నేరస్తులను పట్టించే విధానం గుర్తొచ్చింది. వాటిని చూసి మనిషి భయకంపితుడు కాగానే ఆ వ్యక్తి హావ భావాలను బట్టి అతని చూపుల్లో చూపు కలిపి గుర్రుమంటాయి. ఒకవేళ అతను నేరస్తుడే అయితే మరింత భయకంపితుడౌతాడు. అంతే, అది గమనించిన పోలీసులు అతన్ని తమ కస్టడీలోకి తీసుకుని ఇంటరాగేట్ చేస్తారు, నిజం కక్కిస్తారు. అయితే నేరస్తుడు ఆరితేరినవాడై, మొండిగా గుండెను రాయి చేసుకుని, కదలక మెదలక వుంటె ఏమి ఏమి చేయవే!

మనిషి తన కళ్లెదుట ఓ దృశ్యాన్ని చూడగానే మెదడు, కండరాలకు సంకేతాలను పంపి, తదనుగుణంగా అవయవాలను కదిలేటట్టు ఆదేశిస్తుంది. పరిస్థితి మనసుకు బాధ కల్గిస్తే దుఃఖం, సంతోషం కలిగిస్తే సంతోషం, ఆయా అనుభూతుల్ని బట్టి ముఖ కవళికల్లో మార్పు వస్తూ అదే విషయపు ఛాయలు చూపుల్లో ప్రతిబింబిస్తాయి. ఆ కదలికలు చాలు, ఎదుటి మనిషిని అంచనా వేయచ్చు.

టీవీ లో వచ్చిన వార్తను గుర్తు చేసుకుని ఒక్కసారే సీరియస్‌గా మారిపోతు ' అవును ప్రభుత్వానికి అంత పట్టుదల ఎందుకు? వాళ్ల చేసే మతమార్పిడి గూర్చి ఆలోచించరేం? సంఘజీవనంలో వాళ్ళు వహించే ఏకపక్ష ధోరణి గూర్చి పట్టించుకోరేం? ఈ దేశంలో పుట్టి పెరిగి మతం మార్చుకున్న వాళ్లు ఒకప్పుడు హిందువులే కదా. ఇప్పటి హిందువులతో సంబంధాలకొప్పుకోరేం?

"అయితే వాళ్లని చంపాలా? మనది మతసామరస్య దేశం కదా? మతం మార్చుకున్న క్రైస్తవులు పోగ మనదేశవాసులకు సేవచేయడానికి వచ్చిన ఇతర దేశస్తులను చంపాచ్చా? ఇప్పుడు చూశావు గదా, అవుటౌస్ లో ఈ విదేశి క్రైస్తవురాలు ఎవరికి సేవలు అందిస్తుందో? సొంతదేశాన్ని, చుట్టపక్కాలను వొదిలేసి, పరాయి దేశంవచ్చి, సొంత డబ్బును వెచ్చించి

జబ్బులను నయంచేస్తుంటే వాళ్లను సజీవ దహనం చేయడం భావ్యమా?'

ఆతరువాత కాసేపు మనస్సు మౌనం వహించింది. మెల్లగా బ్యాగ్ తెరిచి అందులో వున్న విస్కీ బాటిల్ తీసాడు. మూతతీసి 'గట, గట' సగం బాటిల్ ఖాళీ చేశాడు. ఆతరువాత మంచినీళ్లను తాగి 'అమ్మ' అంటు నోటిని ఎడమచేత్తో వొత్తుకున్నాడు. బాటిల్ కు మూత బిగించి, తిరిగి బ్యాగ్‌లో భద్రపరుచుకున్నాడు. అప్పటివరకు ముట్టించడానికి వీలుకాని సిగరెట్‌ను జేబులోనుండి తీసి ముట్టించి బయటికి చూస్తూ నిలుచున్నాడు.

ఔట్‌హౌస్ లో వున్న లెపర్స్ నిశ్చలంగ నిద్రిస్తున్నారు. 'మరి తనకెందుకు నిద్ర రావటంలేదు ? రాదు.'

అట్లా చాలామందికి రాదు. రాకపోడానికి కారణాలు ఎన్నెన్నో.

ఏ ఆలోచనా లేనివాళ్లు తాగితే నిద్రవస్తుంది. మనసులో తీవ్రమైన ఆందోళన వున్నప్పుడు తాగితే అదే ఆందోళన మరింత చేయడం ఆల్కాహాల్ లక్షణాల్లో ఒకటి. దానికి తోడు సిగరెట్టు అగ్నికి ఆజ్యం తోడైనట్టు. ఏ ఆలోచనా మనిషిమనస్సులో శాశ్వతంగా వుండదు. కాలం అన్నిటినీ మరిపిస్తుంది. అలా కాకుంటే మనిషి మనుగడే అసాధ్యం.

ఆ మధ్య కూలడానికి సిద్ధంగా వున్నదాన్ని కూల్చిన వాళ్లలో తానూవున్నాడు. అప్పుడు కూడా కొన్ని రోజుల వరకు నిద్రపట్టేదికాదు.

సుందర్‌లాల్ దృష్టి టీపాయ్ మీదున్న ఆల్బమ్‌పై పడింది. దానిని చేతుల్లో తీసుకుని, పేజీలు తిప్పుతున్నాడు. అందులోని ఫోటోలన్ని బరంపురం చుట్టు పక్క ఊళ్లల్లో కుష్టు రోగులకు సేవచేస్తున్న ఫోటోలే. ఒక ఫోటో మీద తన దృష్టి నిలిచింది. లూసి మేడమ్ ఓ కుష్టు రోగి సగం మిగిలిన పాదాన్ని శుభ్రపరుస్తూవుంటె మరో అతను గాయానికి కట్టు కడుతున్నాడు. రోగివైపు ముఖంపెట్టడంవలన అతను ఎవరైందీ గుర్తుపట్టడానికి వీలులేదు. వీళ్ల సేవలు ఇంతా అంతా కాదు. కాని మత మార్పిడే వీళ్లకు కష్టాలు తెచ్చిపెడుతుంది.

'ఎన్ని కష్టాలు కొని తెచ్చుకున్నా చంపేవరకు రాకూడదు కదా? అది ఎదుటివాళ్ల దుర్బుద్ధేకాని వీళ్ల నేరం కానేకాదు.'

మరొకపేజి తిప్పాడు. అక్కడ చూపు ఆగింది. అది అనాథ పిల్లలకు కొత్త బట్టలు, పలకా బలపాలుపంచుతున్న దృశ్యం. లూసి అందిస్తూవుంటెవంగి పిల్లల చేతుల్లో పెడుతున్న ఆవ్యక్తి "ఎవరు? ఎక్కడో చూసినట్టుందే" అని మరీదగ్గరగా పెట్టుకుని చూశాడు.

'అవును అతనే. - సందేహం లేదు!' కళ్లు బైర్లు క్రమ్మాయి. తల తిరిగినట్టు అనిపించింది. ఆల్బమ్‌ను పక్కకు పెట్టి, రెండు చేతులతో ముఖాన్ని కప్పుకుని వరిగాడు. తాగిన మత్తు దిగిపోయింది.

'ఎవరు ఈయన, లూసీ గారి భర్తనా' కారులో కాలిపోయిన వాళ్లు కళ్లముందు

కదిలారు. అబ్బా అంటూ పక్కమీదికి తిరిగాడు. లేచి కూర్చున్నాడు. తట్టుకోలేని అశాంతితో ఖిన్నుడైనాడు. ఆ తరువాత తలుపు కాస్త తెరిచాడు. ఆ శబ్దానికి కుక్క 'గుర్ ర్ర్' మంది. తలుపు మూసేశాడు. వళ్లంతా చెమటపోసింది. తలమీది చెమట నుదుటి మీదుగా జారి ముక్కు చివరి నుండి చుక్కలు చుక్కలు గా కింద పడుతూవుంది.

రాత్రి రెండు దాటింది. ఎవరో గేటు కొట్టిన శబ్దం. లేచి కిటికిలోనుండి చూసాడు. వచ్చినవాళ్లు పోలీసులు. వెంటనే కిందకి వంగాడు. వాళ్ల బుజాలకు తుపాకీలు, చేతుల్లో టార్చిలైట్లు వున్నాయి. ఔట్‌హౌస్ లో వుంటున్న ఓ వ్యక్తి అది గమనించి కాలింగ్ బెల్ నొక్కాడు. అది విన్న లూసి తలుపు తెరుచుకుని బయటికి వచ్చి తిరిగి తలుపులు మూసి గేటుదగ్గరకువచ్చి -

"గుడ్‌మార్నింగ్" అన్నది, తమ మంకి క్యాపులను సరిచేసుకుంటు వచ్చినవాళ్లు "గుడ్‌మార్నింగ్‌మేడమ్ వాళ్లు ఇటే తిరుగుతున్నారట. త్వరలో పట్టుపడతారు" అన్నాడు హెడ్.

లూసి ఏమి మాట్లాడలేదు. మౌనంగా నిలుచుంది.

రాత్రివేళ కనుక వాళ్ల సంభాషణ గెస్ట్ రూంలోకి వినబడుతువుంది. ఆ మాట వినగానే సుందర్‌లాల్ ఉలిక్కిపడి, మంచంకింద నక్కాడు. మనిషంతా చెమటతో తడిసిపోయాడు . శ్వాసను బిగపట్టి వదులుతున్నాడు.

"మేడమ్ ఇటు ఎవ్వరైనా కొత్తవాళ్లు వస్తే మాకు ఫోన్ చేయండి." అన్నాడు హెడ్.

అది విన్న సుందర్‌లాల్ ఉలిక్కిపడ్డాడు. ఆతరువాత తేరుకుని 'అయినా పోన్లు పనిచేస్తేగద' అనుకుంటూ కాస్త నెమ్మదిపడ్డాడు. ఈ లోపల కుక్క వచ్చి పోలీసులను వాసన చూసిపోయింది. కాని చప్పుడు చేయలేదు. మూడునెలల నుండి ఈ పోలీసులు రోజూ ఈ యింటికి వచ్చి పోతూనే వున్నారు. ఒక్కసారి కుక్కకు మనిషిమీద నమ్మకం కుదిరితె ఇక అంతే ఆ మనుషులను ఏమీ చేయదు.

బీట్ పుస్తకంలో లూసి సంతకం తీసుకుని "వస్తాం మేడమ్" అంటూ అక్కడినుండి కదిలారు. గేటు మూసి లోపలికొచ్చి డోర్ బోల్ట్‌పెడుతూవుంది లూసి. అప్పుడేసుందర్‌లాల్ గది తలుపు తెరుచుకుని వచ్చి-

"గుడ్‌మార్నింగ్‌మేడమ్" అన్నాడు చేతులు నలుపుకుంటూ.

"మార్నింగ్. మీరు నిద్రపోలేదా?" అని అడుగుతూ, చలివల్ల టార్చ్‌వున్న చేతిని మరోచేయితో పట్టుకుని కడుపు కింద వుంచి నిలుచుంది. ఉలేన్‌లాంగ్ కోటు లో చాలా నిండుగా వుంది.

"రెస్ట్‌లెస్ గా కనిపిస్తున్నారు. పడుకోండి" అంటూ తనగదివైపు నడిచింది.

'కొంపదీసి అసలు విషయం పసిగట్టలేదుగా' అనుకుంటూ తలుపులు మూసుకుని మంచంమీద వొరిగి కళ్ళుమూసుకున్నాడు.

'మంటలు లేస్తున్నాయి. ఆమంటల్లో కాలుతూ అరుస్తున్న పిల్లలను కడుపుకిందికి తీసుకుని వంగిన మధ్య మయస్కుడికి మంటలు అంటుకున్నాయి. తప్పించుకోలేని పరిస్థితి. మంటల్లో మనుషులు కాలుతున్న కమురువాసన! పోలీసు విజిళ్ళు. ఎక్కడోళ్ళు క్కడ పరార్. ఇప్పటివరకు పరారే'

'ఎన్నాళ్ళు- ఎన్నాళ్ళు- ఇంకెన్నాళ్ళు? ఈ పరిస్థితి. మొదట ఆ పని పురమాయించిన వాళ్ళు ఎవరు? ఎక్కడ? మీ ప్రాణానికి మా ప్రాణం అన్నవాళ్ళెక్కడ? ఇట్లా భయంభయంగా, చాటుమాటుగా తిరగడం ఇంకెన్నాళ్ళు. చెప్పేస్తాను, నిజం చెపేస్తాను. జరిగింది చెప్పేస్తాను' అంటు లేచి కూర్చున్నాడు సుందర్‌లాల్.

'పారిపోతే - మళ్ళి పోలీసులొస్తే, పట్టుకెళతారేమో - పట్టుకెళ్ళి- ఉరిశిక్ష పాలుచేస్తే! ఏది ఏమైనా పారిపోవాలి!' వళ్లంతా చెమటలు, వణుకుడు.

"ఎలా పారిపోతావు? ఎదురుగా వున్న ఆకుక్క నిన్ను ముక్కలు ముక్కలుగ చీల్చదూ?"

'నిజం చెప్పేస్తే ఆమె క్షమించవచ్చు కదా! ముందే కుక్కపాలు ఎందుకు కావాలి.'

"నీవు చేసిన పని క్షమించ దగ్గదేనా! సజీవ దహనం సామాన్యమైంది కాదు కదా? కావాలని చేసిన తప్పుకు ఖచ్చితంగాశిక్ష వుంటుంది."

తలపట్టుకున్నాడు. కళ్ళు తిరిగినట్టు కాగానే కళ్ళు మూసుకున్నాడు. కాళ్ళ చేతులూ వనికాయి. తలను మోకాళ్ళ మధ్య పెట్టి రెండు చేతులతో బిగించి కూర్చున్నాడు.

కళ్ళముందు మంటలు! ఆ మంటల్లో మాడుతున్న మనుషులు!

అంతే వెన్ను పూసలో ఏదో విధ్యుత్ పాకి నట్టయింది. 'అమ్మా' అని అరిచి కళ్ళు బైర్లుకమ్మి పడిపోయాడు. కొంత సేపటికి తేరుకొని, నో నో, నే చెప్పేస్తా! చెప్పేస్తే ఆమె క్షమిస్తుంది, తప్పక క్షమిస్తుంది! అంటు అలాగే కూర్చున్నాడు.

తెల్లవారింది. అవుటౌస్ లో లెపర్స్ కదులుతూవున్నారు. సూర్యోదయపు కిరణాలు అంతటా ప్రసరిస్తున్నాయి. మేడమ్ తలుపు తెరవడానికి వస్తూన్న అడుగుల అలికిడి విన్న సుందర్‌లాల్ తలుపులు తెరుచుకుని ఆమె ఎదుటికొచ్చి -

"మేడమ్ నాపేరు సుందర్ లాల్‌కాదు! అబద్ధం చెప్పాను మన్నించండి" అంటు చేతులు జోడించాడు. "అందరు వెతుకుతున్న ఆ భజన్‌లాల్‌నేనే! నన్ను క్షమించండి." అంటూ

ప్రార్థిస్తూ మోకాళ్ల మీద వంగి కూర్చున్నాడు.

అది విన్న లూసి ఒక్కసారి స్తంభించిపోయింది. ఆమె కళ్ళల్లో మంటలు మంటల్లో కాలుతున్న తనవాళ్లు కదిలారు. గుండెల్లో గూడు కట్టుకున్న దుఃఖం పెల్లుబికి పెదాలు కంపించాయి. ముక్కు పుటలు కదిలాయి. కనురెప్పలు కొట్టడం మానేశాయి. కన్నీరు ఎప్పుడో యింకిపోయినట్టుంది తడికూడా కాలేదు. మెడలోని శిలువను చేతిలోకి తీసుకుని, దానినే కాసేపు చూస్తూవుండిపోయింది. 'నేను ప్రేమించే భర్తను, అతి ప్రియమైన నా సంతానాన్ని నాకు లేకుండా చేసింది నీవేనా?' అని తన్నుకొస్తున్న దుఃఖం తో అతని వైపు చూసింది. ఆ తరువాత మూసిన తలుపుల వైపు చూసింది. తలుపు సందుల్లో నుండి వెలుతురు కిరణాలు లోపలికి ప్రసరిస్తున్నాయి.

ఆమె మౌనాన్ని తట్టుకోలేక భజన్‌లాల్ తన చేతులతో ముఖాన్ని కప్పుకుని రోదిస్తున్నాడు.

ఏ కదలికలు లేకుండ లూసి నడిచి తలుపు తెరచి, కుక్కను దాని గూటిలోకి తోలి, డోర్‌పెట్టింది. ఎదురుగా లెపర్స్

"వందనాలమ్మ వందనాలు" అంటున్నా మౌనంగా వెళ్లి గేటు తెరిచింది. అది గ్రహించిన భజన్‌లాల్ తన వస్తువులను భుజాన వేసుకుని, గేటు దగ్గరవున్న లూసీకి మరోసారి చేతులు జోడిస్తూ బయటకి నడిచాడు. గేటు మూసి లూసి అతను వెళుతున్న వైపు చూస్తూనిలుచుంది.

కొంత సేపటికి అతను కనుమరుగై, సూర్యుడు మాత్రమే కనిపించాడు.